క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలలో నోబ్యాగ్ డే



యోగా చేయిస్తున్న ఉపాధ్యాయులు

గోదావరిఖనిటౌన్: ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రతి నాలుగో శనివారం నోబ్యాగ్ డేగా పాటించాలనే ప్రభుత్వ నిర్ణయం మేరకు జనగామ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఇన్‌చార్జి హెచ్ఎం గద్దె శ్రీనివాస్ యోగా, రోల్ ప్లే, ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మారాణి, విజయలక్ష్మి, వెంకటరాజం, కనకయ్య, కేడం శ్రీనివాస్, రమ్య పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న కౌన్సిలర్ జ్ఞానేశ్వరి

సుల్తానాబాద్: నూతనంగా ఏర్పడిన సుల్తానాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి కృషి చేస్తున్నారని వైస్ చైర్‌పర్సన్ బిరుదు సమత, కౌన్సిలర్లు పారుపల్లి జ్ఞానేశ్వరి, అనుమాల అరుణ, గొట్టం లక్ష్మి, రేవల్లి తిరుపతి అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇప్పటికే పట్టణ అభివృద్ధికి రూ.కోట్ల నిధులు కేటాయించారని, పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు గాజుల రాజమల్లు, బిరుదు కృష్ణ, గొట్టం మహేశ్, అనుమాల బాబురావు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాప్రాంగణం ప్రారంభం



క్రీడాప్రాంగణం ప్రారంభిస్తున్న తహసీల్దార్

ఓదెల: మండలంలోని గోపరపల్లెలో శనివారం గ్రామీణ క్రీడాప్రాంగణాన్ని తహసీల్దార్ కత్రోజు రమేశ్ ప్రారంభించారు. సర్పంచ్ కర్క మల్లారెడ్డి, ఓదెల ఎంపీడీవో జి.సత్తయ్య, ఆర్ఐ బండ రాజేందర్, ఎంపీవో వాజీద్, కార్యదర్శి ప్రసాద్, పొత్కపల్లి సింగిల్‌విండో మాజీ చైర్మన్ గోపు నారాయణరెడ్డి, ఉపాధిహామీ టీఏ జనార్దన్, సూపరింటెండెంట్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరం



ర్యాలీ తీస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

కమాన్‌పూర్(రామగిరి): మంథని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో రామగిరి మండంలోని పన్నూర్ గ్రామంలో వారంరోజులుగా నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ శిబిరం శనివారం ముగిసింది. చివరి రోజు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విద్యార్థులు వ్యవసాయంలో అధిక దిగుబడి ఎలా సాధించాలి, డిజిటల్ లావాదేవీలు ఎలా చేయాలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగాం అధికారి దుర్గారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి, పీడీ పింగళి కృష్ణారెడ్డి, ఎన్ఎస్ఎస్ కోర్డినేటర్ పుప్పాల తిరుపతి, కాదాసి సదానందం పాల్గొన్నారు.

గో సంతతిని కాపాడాలి



వినతిపత్రం ఇస్తున్న బజరంగ్‌దళ్ సభ్యులు

ధర్మారం: బక్రీద్ సందర్భంగా గో సంతతి హత్యలు జరగకుండా కాపాడాలని కోరుతూ బజనరంగ్‌దళ్ ఆధ్వర్యంలో శనివారం ధర్మారం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. పట్టణ, మండల కేంద్రాల్లో విచ్చలవిడిగా జరుగుతున్న గోహత్యలను ఆపాలని, అక్రమంగా రవాణా అవుతున్న గోసంతతిని కాపాడాలని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు. గోవులను అక్రమ రవాణా చేస్తున్న వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. బజరంగ్‌దళ్ మండల సంయోజక్ దిలీప్, నాయకులు బన్నీ, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

దర్జాగా దారి కబ్జా

- 100ఫీట్ల రోడ్డుకు స్థలం సేకరించినా కుదింపునకు గురైన వైనం
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- భూములను ఆక్రమిస్తున్న వైనం



చిన్నగా, వంకర టింకరగా ఉన్న తారు రోడ్డు

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్ ఇందిరమ్మ కాలనీ మేడిపల్లి రోడ్డు నుంచి ఇటీవల తారురోడ్డు నిర్మించారు. సింగరేణి సంస్థ ఓపెన్ కాస్టు నిర్వహించేందుకు గతంలో ఈ ప్రాంతం మీదుగా 100 ఫీట్ల రోడ్డుకు స్థలాన్ని సేకరించింది. కానీ కొన్ని కారణాలతో ఇందిరమ్మకాలనీ రావడంతో రోడ్డు స్థలం కాలనీల్లో అంతర్లీనంగా మారింది. దీంతో 100ఫీట్ల రోడ్డును కొందరు అక్రమార్కులు తక్కువగా చేసేందుకు యత్నాలు సాగిస్తున్నారు.

100 ఫీట్ల రోడ్డు కబ్జా..?

సింగరేణి సంస్థ రోడ్డు కోసం సేకరించిన భూమిని 100 ఫీట్ల రోడ్డును కొందరు అక్రమార్కులు కబ్జా చేస్తున్నట్లు స్థానికంగా మాట్లాడుకుంటున్నారు. సంస్థ నుంచి పరిహారం పొందినప్పటికీ పట్టా మార్పిడి చేసుకోకపోవడంతో స్థలం అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లినట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. లింకు రోడ్డును 100 ఫీట్ల నుంచి 30ఫీట్ల వరకు కుదించి మిగతా భూమిని ఆక్రమించేందుకు యత్నాలు కొనసాగుతున్నాయి.

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు

ఇందిరమ్మకాలనీలోని ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు. కొందరు ఆక్రమణదారులపై చర్యలకు ఆదేశించాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు పేదలకు ప్రభుత్వ భూమిని కేటాయిస్తారు. ప్రభుత్వ భూమిలో నిర్మించొద్దని సూచనలు చేశాం. కొందరు అక్రమంగా నిర్మిస్తే కూల్చివేశాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ యంత్రాంగం పనిచేస్తుంది. – జాహెద్ పాషా, తహసీల్దార్, రామగుండం

హద్దులు లేకపోవడంతో..

విలువైన ప్రభుత్వ భూమి బందీగా మారుతోంది. సేకరించిన స్థలానికి హద్దులు లేకపోవడంతో కొంతమంది భూములను ఆక్రమించుకుని విక్రయిస్తున్నారు. ఇందిరమ్మ కాలనీలోని పేదలకు కేటాయించిన భూములను సైతం ఆక్రమించడం, సాదా కాగితాలతో విక్రయించడం పరిపాటిగా మారింది. రెవెన్యూ అధికారులు అక్రమ కట్టడాలను తొలగించినా మళ్లీ తిరిగి కట్టడాలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ భూములను కాపాడే ప్రయత్నంలో రెవెన్యూ అధికారులు ఉన్నారు.

100ఫీట్ల రోడ్డు నిర్మించాలి



ఇందిరమ్మ కాలనీ నుంచి మేడిపల్లి మెయిన్ రోడ్ వరకు 100ఫీట్ల రోడ్డును నిర్మించాలి. ఇటీవల నిర్మించిన రోడ్డు ఏ ప్రాతిపదికన నిర్మించారో ప్రజలకు తెలియజేయాలి. రోడ్డును ఏర్పాటు చేసే సమయంలో ఇంజనీరింగ్ అధికారులు రోడ్డు వెడల్పు, పొడవు, మలుపులు ఎలా చూశారో అర్థం కావడం లేదు. – కత్తెరమల్ల రమేశ్, మాజీ కౌన్సిలర్

హద్దులు ఏర్పాటు చేయాలి



ఇందిరమ్మకాలనీ నుంచి మేడిపల్లి రోడ్ వరకు 100ఫీట్ల రోడ్డుకు స్థల సేకరణ జరిగిన విషయం మర్చిపోవద్దు. ప్రస్తుతం వేసిన రోడ్డుకు ఇరువైపులా 100ఫీట్ల రోడ్డు కొలతల ప్రకారం హద్దులు ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ స్థలం ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి. సింగరేణిసంస్థ రోడ్డు కోసం సుమారు 13 ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేసింది. – ఎండీ రహీం, కాంగ్రెస్ జిల్లా నాయకుడు

గీత కార్మికులకు రూ.లక్ష సాయం అందించాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించిన గీత కార్మికులు

జూలపల్లి: ప్రభుత్వం ప్రకటించిన వెనకబడిన తరగతుల కులాలకు అందిస్తున్న రూ.లక్ష సాయం గీత కార్మికులకు కూడా అందించాలని కోరుతూ మండల కేంద్రంలో గీత కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. నినాదాలు చేస్తూ తహసీల్దారు కార్యలయం ఎదుట బైఠాయించారు. కలెక్టర్ వచ్చి రూ.లక్ష సాయానికి హామీ ఇస్తేనే లేస్తామన్నారు. డిప్యూటీ తహసీల్దారు అబూబకర్ గీత కార్మికులతో మాట్లాడి నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వినలేదు. దీంతో పెద్దపల్లి ఆర్డీవో వెంకటమాధవరావుకు సమాచారం అందించారు. ప్రభుత్వం చేతుల్లో నిర్ణయం ఉంటుంది కాబట్టి వినతిపత్రం ఇవ్వాలని సూచించడంతో గీత కార్మికులు డిప్యూటీ తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ గీత కార్మికులను రూ.లక్ష సాయంలో చేర్చకపోతే ఆందోళనలు తప్పవని తెలిపారు. గీత కార్మికులు తీగెల అశోక్‌గౌడ్, ఏగోళపు సదయ్యగౌడ్, గడ్డమీది మహేశ్, బత్తిని శ్రీనివాస్, పాలకుర్తి అంజయ్య, కోడూరి కొమురయ్య, ఆరెల్లి సాయిలు, తీగెల తిరుపతి, పొన్నం వెంకటేశ్, అమరగాని పురుషోత్తం, లచ్చయ్య, పర్శయ్య, అమరగాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలన

మంథని: మున్సిపాలిటీ పరిధిలోని పలు వీధుల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ పరిశీలించారు. బొక్కలవాగులో ఎకో పార్కు నుంచి బోయిన్‌పేట వరకు నిర్మిస్తున్న సైడ్ డ్రైన్, వాల్ నిర్మాణ పనులు, పద్మశాలి వీధిలో నూతన పైపులైన్‌లను పర్యవేక్షించారు. మున్సిపల్ కౌన్సిలర్ గర్రెపల్లి సత్యనారాయణ, నాయకులు కొట్టె రమేశ్ ఉన్నారు.

క్లాత్ బ్యాగుల పంపిణీ



క్లాత్ బ్యాగు అందజేస్తున్న అధికారులు

కమాన్‌పూర్: మండలంలోని పేంచికల్‌పేట గ్రామంలో సింగరేణి సంస్థ ఆర్జీ–2 ఆధ్వర్యంలో శనివారం ప్రజలకు క్లాత్ బ్యాగులను పంపిణీ చేశారు. సింగరేణిలో నిర్వహిస్తున్న స్వచ్ఛత పక్వాడా కార్యక్రమంలో భాగంగా ప్రజలకు క్లాత్ బ్యాగులు పంపిణీ చేసినట్లు ప్రోగాం కన్వీనర్ డీజీఎం మురళీకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండ వెంకటేశ్, టీబీజీకేఎస్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, అధికారులు రాజేంద్రప్రసాద్, వెంకటమోహన్, సురేశ్‌బాబు, ప్రతాపగిరి రాజు, మండల శ్రీనివాస్ పాల్గొన్నారు.

మండలాన్ని అభివృద్ధి చేసిన ఘనత శ్రీధర్‌బాబుదే



మాట్లాడుతున్న వైనాల రాజు

కమాన్‌పూర్: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కమాన్‌పూర్ మండలాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసిన ఘనత మాజీ మంత్రి ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబుదేనని కాంగ్రెస్ మండల అధక్షుడు వైనాల రాజు అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ లేదు, మండల కేంద్రం నుంచి పేంచికల్‌పేట మీదుగా గోదావరిఖనికి వెళ్లే మార్గంలో డబుల్‌రోడ్డు వేయడంలో పూర్తి విఫలం చెందారని ఆరోపించారు. మండలాన్ని మూడు ముక్కలు చేయడమేనా అభివృద్ధి అంటే అని ప్రశ్నించారు. నాయకులు రంగు సత్యనారాయణ, భూంపెలి రాజయ్య, అప్సర్, శేఖర్, ఇక్బాల్, రవి, నర్సయ్య, సతీశ్, రవి, లింగయ్య, రాయమల్లు పాల్గొన్నారు.

బహుజనులు ఏకం కావాలి

రామగుండం: బహుజనులందరూ ఏకం కావాలని బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరికిళ్ల రాజనర్సయ్య కోరారు. అంతర్గాంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వందలాది ఎకరాలు ఉన్నవారికి రైతుబంధు చెల్లిస్తున్న సర్కారు.. దళిత రైతులకు మాత్రం దళితబంధు ఇవ్వడం లేదని, దశాబ్ది వేడుకలు కేవలం సీఎం కేసీఆర్ కుటుంబం కోసమేనని ఆరోపించారు. అంతర్గాం వద్ద గోదావరినదిపై హైలెవల్ తీగల వంతెన నిర్మిస్తే గంగపుత్రులకు ఉపాధి, పర్యాటకంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రతినిధులు ఉదయ్‌కుమార్, గోలివాడ ప్రసన్నకుమార్, ఈదునూరి ధర్మయ్య, రాజశేఖర్, రాజు, వికాస్, ప్రశాంత్ ఉన్నారు.

లేడీస్ క్లబ్ అధ్యక్షురాలికి ఆత్మీయ సన్మానం



సన్మానిస్తున్న సేవా అధ్యక్షురాలు అలివేణి

కమాన్‌పూర్(రామగిరి): ఆర్జీ–3 ఏరియా లేడీస్ క్లబ్ అధ్యక్షురాలిగా పనిచేసిన టి.శ్రీదేవి–టీవీ రావును శనివారం సెంటనరీకాలనీ సీవోఏ క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్లబ్ నూతన అధ్యక్షురాలు అలివేణి, ఏపీఏ జీఎం సతీమణి విజయలక్ష్మి, క్లబ్ సభ్యులు సన్మానించారు. ఆర్జీ–1 లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు లక్ష్మితో పాటు జయలక్ష్మి, పద్మ, కమిటీ సభ్యులు సుజాత, హరిణి, ప్రసన్న, కోమలి, లావణ్య, నిఖిత పాల్గొన్నారు.

ఆర్జీ–3 జీఎంకు సన్మానం

కమాన్‌పూర్: ఆర్జీ–3 జీఎంగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎస్.సూధాకర్‌రావును సదాశయ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి ఆధ్వర్యంలో జీఎంను కలిసి సన్మానించారు. సదాశయ ఫౌండేషన్ చేపట్టే నేత్ర, అవయ, శరీర దానాలను జీఎంకు వివరించారు. కార్యక్రమంలో రమేశ్, లింగమూర్తి, శ్రీనివాస్, రాజమహేందర్‌రెడ్డి, రామ్మూర్తి, నరసింహచారి, కొండ అన్నపూర్ణ ఉన్నారు.

ఆర్‌అండ్‌ఆర్ సమస్యలు పరిష్కరించండి

కమాన్‌పూర్(రామగిరి): రామగిరి మండలంలోని రత్నాపూర్‌లో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న ఆర్‌అండ్‌ఆర్ సైట్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రత్నాపూర్ సర్పంచ్ పల్లె ప్రతిమ ఆర్జీ–3 జీఎం సూధాకర్‌రావుకు శనివారం వినతిపత్రం అందజేశారు. సైట్‌లో అంతర్గత రహదారులు 30, 20 ఫీట్లు చేపట్టాల్సి ఉండగా 10ఫీట్ల రోడ్లు మాత్రమే వేశారని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, దేవాలయం, వైకుంఠదామంతో పాటు మురుగు నీటి కాల్వల నిర్మాణంతో పాటు తదితర సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. రూ.1.10కోట్లతో నిర్మించిన వాటర్ ట్యాంక్‌లో మిషన్ భగీరథ నీటితో నింపాలని కోరారు. సివిల్ డీజీఎం పద్మరాజు, డిప్యూటీ మేనేజర్ శ్రీనివాస్, వార్డు సభ్యులు సురేశ్, నాయకులు పీవీ రావు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

✦ఓదెలలో భారీ వర్షం

ఓదెల: మండలంలో శనివారం భారీ వర్షం కురిసింది. ప్రస్తుతం దుక్కులు దున్ని పత్తి విత్తనాలు నాటిన రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

✦27న ఉచితంగా కంది విత్తనాల పంపిణీ

కమాన్‌పూర్: మండలంలోని గుండారం రైతువేదికలో 27న రైతులకు ఉచితంగా కంది విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు ఏవో బండి ప్రమోద్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కేవీకే, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో కంది విత్తనాలతో పాటు పురుగు మందులు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. కందిసాగు చేసే రైతులు ముందుగా ఏవో కార్యాలయం లేదా ఏఈవోను సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

✦మొదటి విడత మొక్కజొన్న పరిహారం జమ

జూలపల్లి: మండలవ్యాప్తంగా యాసంగిలో కురిసిన వడగండ్లు, అకాల వర్షాలకు నష్టపోయిన మొక్కజొన్న పంట రైతులకు ఎట్టకేలకు పరిహారం బ్యాంకు ఖాతాల్లో జమైందని వ్యవసాయాధికారి ప్రత్యూష తెలిపారు. మొదటి విడతలో నష్టపోయిన 434మంది రైతులకు రూ.22.89లక్షలు ఖాతాల్లో జమయ్యాయని ఆమె పేర్కొన్నారు.

బీఎస్పీకి సంపూర్ణ మద్దతు ఇవ్వాలి



నినాదాలు చేస్తున్న నాయకులు

కాల్వశ్రీరాంపూర్: రాజ్యాధికారంతోనే బహుజనులకు న్యాయం జరుగుతుందని, బీఎస్పీకి సంపూర్ణ మద్దతు ఇవ్వాలని పార్టీ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష కోరారు. మండలంలోని పెగడపల్లిలో శనివారం 'మన ఊరు మన ఉషక్క' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి విరాళాలు సేకరించారు. పారిశుద్ధ్య కార్మికులను సన్మానించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి హనుమయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్ పటేల్, మండల అధ్యక్షుడు కుమ్మరికుంట రవికుమార్, నాయకులు కిరణ్, కొమురయ్య, శారద, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌ను కలిసిన రామగుండం ఎమ్మెల్యే

- పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేత



సీఎం కేసీఆర్‌తో ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: సీఎం కేసీఆర్‌ను రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ శనివారం రాత్రి ప్రగతిభవన్‌లో కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేయగా సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. 76జీవో అమలు, కురూజ్‌కమ్మీ భూముల సమస్య, ఎల్లంపల్లి ఆర్‌అండ్‌ఆర్ పరిహారాలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. నర్సింగ్ కళాశాల మంజూరుకు సింగరేణి సీఎండీకి ఆదేశాలు జారీ చేశారు. రోడ్ల అభివృద్ధికి రూ.10కోట్లు, నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.100కోట్లు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. పారిశ్రామిక ప్రాంతమైన రామగుండంకు ఇప్పటికే మెడికల్ కళాశాల మంజూరు చేయగా నర్సింగ్ కళాశాల కూడా మంజూరు చేయాలని కోరడంతో సానుకూలంగా స్పందించిన సీఎం వెంటనే సింగరేణి సీఅండ్ఎండీకి ఫోన్ చేసి ఆదేశించారు. అంతర్గాం మండలం పెద్దంపేట, రాయదండి గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న కురూజ్‌కమ్మీ 1018 ఎకరాల భూముల సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేయగా ప్రభుత్వ కార్యదర్శి నవీన్ మిట్టల్‌కు ఫోన్ చేసి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. నియోజకవర్గానికి ప్రకటించిన రూ.100కోట్ల స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్‌ను మంజూరు చేయాలని కోరగా వెంటనే మంజూరు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారని ఎమ్మెల్యే తెలిపారు. సమస్యలపై సానుకూలంగా స్పందించినందుకు సీఎంకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ జగదీష్

ఎలిగేడు: సైబర్ నేరాలపై గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సుల్తానాబాద్ సీఐ కె.జగదీష్ అన్నారు. ఎలిగేడు మండలం ధూళికట్టలో శనివారం రాత్రి సైబర్‌నేరాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రస్తుతం రైతుల వద్ద వరిధాన్యం డబ్బులు ఖాతాల్లో ఉంటాయని, ఇదే అదునుగా సైబర్ నేరగాళ్లు బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామంటూ ఓటీపీ అడుగుతారని, ఓటీపీ చెప్తే బ్యాంకులో ఉన్న డబ్బు గల్లంతవుతుందని వివరించారు. సైబర్ నేరగాళ్లు గ్రామీణ ప్రాంత ప్రజలను బురిడి కొట్టిస్తున్నారని, అపరిచిత ఫోన్‌కాల్స్ వచ్చినప్పుడు స్పందించొద్దని సూచించారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు కనపడితే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో జూలపల్లి ఎస్సై వెంకటకృష్ణ, సర్పంచ్ గొల్లె కావేరి, రైతు సమన్వయసమితి మండల కన్వీనర్ నరినేని సుధాకర్‌రావు, ఏఎస్సై బాస్కర్, హెడ్ కానిస్టేబుల్ శాంతయ్య, పీసీలు అజీమొద్దీన్, రాజేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

డయల్ 100కు సమాచారం ఇవ్వండి



మాట్లాడుతున్న ఎస్సై మహేందర్

పెద్దపల్లిరూరల్: ఆపదలో ఉన్న ప్రజలు తమ సమస్యను డయల్ 100కు ఫోన్ చేసి చెప్తే సత్వరమే స్పందిస్తామని ఎస్సై మహేందర్ అన్నారు. మహిళల రక్షణ కోసం షీ టీమ్‌లు పనిచేస్తున్నాయని, మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పెద్దపల్లి మండలంలోని కనగర్తిలో శనివారం ఏర్పాటు చేసిన గ్రామసభలో ఎస్సై మాట్లాడారు. మత్తు పదార్థాలు, గంజాయి విక్రయించినా, సరఫరా చేసినా కఠిన చర్యలు తప్పవన్నారు. సర్పంచ్ పర్స స్వప్న, ఎంపీటీసీ ఎడెల్లి శంకర్, పంచాయతీ కార్యదర్శి శ్రీలత పాల్గొన్నారు.

పేదలకు అండగా నిలబడడమే లక్ష్యం



బెంచీ ప్రారంభిస్తున్న సెక్రటరీ చంద్రమౌళి గుప్తా

సుల్తానాబాద్: పేద ప్రజలకు అండగా నిలబడమే వాసవి క్లబ్ లక్ష్యమని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సెక్రటరీ మర్యాల చంద్రమౌళి గుప్తా అన్నారు. మండల కేంద్రంలో శనివారం వాసవి క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పంచాయతీ కార్మికులకు, మున్సిపల్ సిబ్బందికి చీరలతోపాటు నిత్యావసర వస్తువులు అందజేశారు. బెంచీలు వితరణ చేశారు. రైతులకు మందులు అందజేశారు. చందా రవీందర్, రీజియన్ చైర్‌పర్సన్ ఎల్లంకి రాజన్న, జోన్1 చైర్మన్ అల్లంకి లింగమూర్తి, జోన్2 చైర్ పర్సన్ బాదం వాణి, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రమేశ్, జిల్లా ఆర్యవైశ్య మహిళా అధ్యక్షురాలు పల్ల అపర్ణ, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొమురవెల్లి భాస్కర్, వాసవి మాత ఆలయం చైర్మన్ చకిలం మారుతి, శివాలయం చైర్మన్ అల్లంకి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

గోదావరిఖని: ముదిరాజ్‌లపై అనుచిత వాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను శనివారం దహనం చేశారు. కౌశిక్‌రెడ్డి వెంటనే ముదిరాజ్ కులానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నాయకులు నాయిని మధునయ్య, సబ్బు మల్లయ్య, పిడుగు కృష్ణ, దబ్బెట శంకర్, తూడి రాజయ్య, భిక్షపతి పాల్గొన్నారు.

మంథని, గుంజపడుగులో..

మంథని: ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డికి వ్యతిరేకంగా మంథని, గుంజపడుగు గ్రామాల్లో ఆ సంఘం నాయకులు నిరసనలు చేపట్టారు. మంథనిలో శనివారం కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం రాస్తారోకో నిర్వహించారు. అలాగే మండలంలోని గుంజపడుగులో కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం మండల అధ్యక్షుడు పోతరవేని క్రాంతికుమార్, పిల్లి శేఖర్, అనవేన సదయ్య, ఊదరి శంకర్, తీగల సమ్మయ్య, వేల్పుల సరోజన, గుండా రాజు, నరెడ్ల కిరణ్, సబ్బని సంతోష్, వీరబోయిన రాజేందర్, బొల్లి శంకర్, కుంట రాజు, ఊదరి శంకర్, ఓదెలు, మబ్బు శంకర్, గుర్రాల శ్రీను ఉన్నారు.

'రూ.లక్ష సాయం' దరఖాస్తుల పరిశీలన

జ్యోతినగర్: కులవృత్తుల వారికి చేయూత అందించేందుకు ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష సాయానికి వచ్చిన దరఖాస్తులను వాటర్ బిల్ కలెక్టర్ వసంతరావు, బిల్ కలెక్టర్ అలివెల్లి మహేశ్ పరిశీలించారు. రామగుండం కార్పొరేషన్ 2, 3, 4, 5, 22, 23వ డివిజన్లలో శనివారం సుమారు వందమంది దరఖాస్తుదారుల వద్దకు వెళ్లి పరిశీలించారు. ఆరు డివిజన్లలో సుమారు 100కు పైగా దరఖాస్తులు పరిశీలించినట్లు అధికారులు పేర్కొన్నారు.

ఎలిగేడు: బీసీలకు రూ.లక్ష రుణం కోసం మండలంలోని 12 గ్రామాల్లోని అర్హులు రూ.లక్ష రుణం కోసం 474మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఎంపీవో అనిల్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు వచ్చిన దరఖాస్తులను గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు శనివారం ఇంటింటా తిరిగి పరిశీలించారు. పలు గ్రామాల్లో ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, ఎంపీవో అనిల్‌రెడ్డి.. కార్యదర్శులు చేస్తున్న పరిశీలనను పర్యవేక్షించారు.

ధర్మారం: మండలంలో బీసీ రుణం కోసం 987 మంది దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో భీమ జయశీల తెలిపారు. మండలంలోని 29 గ్రామపంచాయతీల నుంచి దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. అయితే గ్రామాల వారిగా దరఖాస్తులను వేరు చేసి గ్రామపంచాయతీలకు పంపించినట్లు చెప్పారు. దరఖాస్తుదారుల స్థితిగతులపై ఆయా పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో విచారణ చేయాలని ఆదేశించినట్లు తెలిపారు.